క్లుప్తంగా

80 శాతం పీఎంజేవై సర్వే పూర్తి

ఫిరంగిపురం: పలు గ్రామాల్లో పధానమంత్రి జన ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) 80 శాతం పూర్తి అయినట్లు వైద్యాధికారి శ్వేత తెలిపారు. ప్రతి గ్రామంలో ఆరోగ్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి 70 ఏళ్లు నిండినవారి ఆరోగ్య వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా వారికి పీఎంజేఏవై కార్డు అందజేస్తారని, దేశంలో ఏప్రాంతంలోనైనా రూ.5 లక్షల వరకు ఆరోగ్యసంబంధిత పరీక్షలు, చికిత్స చేస్తారని పేర్కొన్నారు. రేషన్ కార్డు ఉన్న వారికి సంబంధించి కార్డులోని ప్రతిఒక్కరి ఆరోగ్యపరమైన అంశాలూ యాప్‌లో నమోదు చేస్తున్నారని చెప్పారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

మంగళగిరి: నగర పరిధిలోని నూతక్కి గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైంది. మంగళగిరి రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. నూతక్కికి చెందిన మోదుగుల తేజశ్రీ(32) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో తేజశ్రీ కనిపించడం లేదని గురువారం రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌ఆర్‌ఎంలో రక్తదానం



మంగళగిరి: నీరుకొండ గ్రామంలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రి నుంచి వచ్చిన వైద్య బృందం ఏర్పాటు చేసిన శిబిరాన్ని యూనివర్సిటీ వీసీ డాక్టర్ మనోజ్ కుమార్ అరోరా, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ ప్రారంభించారు. యూనివర్సిటీ విద్యార్థులు, ప్రొఫెసర్లు, ఉద్యోగులు 404 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని వీసీ మనోజ్ కుమార్ అరోరా అభినందించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినయ్, స్టూడెంట్ అఫైర్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ వడ్డి రమేష్, రేవతి బాలకృష్ణన్, జీజీహెచ్ వైద్యులు డాక్టర్ రమ్య, వంశీ పాల్గొన్నారు.

నేడు ఎస్‌ఆర్‌ఎంలో 9వ రీసెర్చ్ డే

మంగళగిరి: మండలంలోని నీరుకొండ గ్రామంలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో శుక్రవారం 9వ రీసెర్చ్ డే జరుగుతుందని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్లు, విద్యార్థులు పరిశోధనారంగంలో రాణించేందుకే రీసెర్చ్ డే ఉపయోగపడుతుందని వివరించారు. రీసెర్చ్ డేకు ముఖ్య అతిథిగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, రీసెర్చ్(బెర్హంపూర్) డైరెక్టర్ ప్రొఫెసర్ అశోక్ కుమార్ గంగూలి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వెల్లడించారు.

లింగమయ్య హత్య కేసుపై ప్రభుత్వ నిర్లక్ష్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మంగళగిరి: సత్యసాయి జిల్లాలో ఇటీవల జరిగిన కురుబ లింగమయ్య హత్య విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని, రాజకీయ కోణంలో వెళ్లేది కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. చినకాకానిలో రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే లింగమయ్య హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిందన్నారు. సోషల్ మీడియాలో ప్రతిపక్ష నేతలపై పోస్టులు పెడుతున్న వారిని సర్కారు ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. ఐదుగురు ఐపీఎస్ అధికారులు సస్పెండ్ కావడం దేశంలోని మరే రాష్ట్రంలోనూ జరగలేదని, ఇది ప్రభుత్వ, పోలీసుల ప్రతిష్టను దిగజార్చిందని పేర్కొన్నారు. రామగిరి ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ వ్యవహరించిన తీరు పోలీసు వ్యవస్థకు చెడ్డపేరు తెచ్చిందన్నారు. అతని తీరును అందరూ ఖండించాలన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.

చిన్నారులకు వడదెబ్బ నుంచి రక్షణ తప్పనిసరి

ఫిరంగిపురం: వేసవిలో చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి శ్వేత అన్నారు. వేములూరిపాడు గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 94 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. డాక్టర్ శ్వేత మాట్లాడుతూ వేసవిలో చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎండలో తిరగకుండా ఉండాలన్నారు. వడదెబ్బ తగిలిన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను నీటిలో కలిపి పది నిమిషాలకోమారు తాగించాలని దానిద్వారా కొంత ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, బాబురావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాల పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ గురువారం కొనసాగింది. శుక్రవారం కూడా క్యాంప్ జరుగుతుందని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి చెప్పారు.

బాధ్యతాయుత రాజకీయాలు చేద్దాం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు
- అనుబంధ విభాగాల నేతల సమావేశం



మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

తాడికొండ: బాధ్యతాయుతమైన రాజకీయాలు చేద్దామని, పార్టీని బలోపేతం చేద్దామని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు అన్నారు. గురువారం గుంటూరులోని స్వగృహ ఫంక్షన్ హాల్‌లో పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా జిల్లా, మండల స్థాయి పదవులకు నియోజకవర్గం తరుపున ఎంపిక కాబోతున్న నాయకులకు ముందస్తుగా ఏర్పాటు చేసిన సమావేశంలో వజ్రబాబు మాట్లాడారు. శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వజ్రబాబు మాట్లాడుతూ పదవులు అలంకార ప్రాయం కాకూడదని, ఎంపికైన నాయకులు బాధ్యతతో కూడిన రాజకీయాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అందరినీ కలుపుకొని పోవాలని పేర్కొన్నారు. వ్యక్తిగతం వేరు రాజకీయాలు వేరు కనుక వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో పగవాడిని కూడా కలుపుకొని వెళ్ళి పార్టీ విజయానికి బాటలు వేయాలని సూచించారు. పదవుల ఎంపిక విషయంలో అందరికీ సముచిత న్యాయం చేయాలని చూసినప్పటికీ కొంతమంది ఇంకా మిగిలే ఉన్నారని, వారికి కూడా భవిష్యత్తులో పార్టీలో సముచిత స్థానం కల్పించి వారి సేవలు ఉపయోగించుకుంటామని పేర్కొన్నారు. ఎవరూ అసంతృప్తి చెందాల్సిన అవసరం లేదన్నారు. వైఎస్సార్ సీపీకి తాడికొండ నియోజకవర్గంలో ఎంత ఆదరణ ఉంది అనేందుకు గ్రామాల్లోకి వెళితే తనకు వస్తున్న స్పందనే చూస్తే తెలుస్తోందని, నాయకులు కిందిస్థాయికి వెళ్ళి ప్రజా సమస్యలపై ప్రణాళికా బద్ధంగా పనిచేసి అండగా నిలవడం ద్వారా ఓటు బ్యాంకును మరింతగా బలోపేతం చేసుకోవచ్చని సూచించారు. తనను ఇన్‌చార్జిగా నియమించిన తరువాత అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి చెందిన ప్రతి నాయకుడితో కలిసి గ్రామాల్లో తిరిగి పార్టీ పదవుల ఎంపికను ఏకాభిప్రాయంతో పూర్తిచేసేందుకు కృషి చేశానని వివరించారు. అధికార కూటమికి ప్రజల్లో పూర్తిగా ఆదరణ తగ్గిందని, ఇచ్చిన హామీలు అమలు చేయడంలోనూ కూటమి విఫలమైందని వజ్రబాబు విమర్శించారు. గత ప్రభుత్వంలో ప్రజలంతా లబ్ధి పొందారని, ఇప్పుడు కూటమి నేతలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. కష్టపడి పనిచేస్తే 2029లో వైఎస్సార్ సీపీ జెండాను రాజధాని ప్రాంతంలో ఎగరేయడం సులభమే అన్నారు. కార్యక్రమంలో ఫిరంగిపురం, మేడికొండూరు జెడ్పీటీసీ సభ్యులు దాసరి కత్తిరేణమ్మ, కందుల సిద్దయ్య, వివిధ విభాగాల ముఖ్య నాయకులు చిట్టా అంజిరెడ్డి, ముప్పాళ్ళ మనోహర్, మైనేని నాగమల్లేశ్వరరావు, బత్తుల కిషోర్, తాళ్ళూరు వంశీ చౌదరి, దాసరి రాజు, తాళ్ళ శివనాగరాజు, రాఘవ రెడ్డి, తమ్మనంపల్లి శాంతయ్య, కొప్పుల శేషగిరి రావు, చుండు వెంకటరెడ్డి, రేపూడి రంజన్ బాబు పలువురు అనుబంధ విభాగాల జిల్లా, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.



పాల్గొన్న అనుబంధ విభాగాల నేతలు

త్వరలో ప్రజా ప్రతినిధులు, గ్రామ కమిటీ నాయకులతో సమావేశం

త్వరలో వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, గ్రామ కమిటీ సభ్యులుగా ఎన్నికైన నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వనమా బాల వజ్రబాబు (డైమండ్) తెలిపారు. గ్రామ స్థాయి అనుబంధ విభాగాల ఏర్పాటు ప్రక్రియ కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తాడికొండ ఆరోగ్యకేంద్రంలో స్కానింగ్ సేవలు పునఃప్రారంభం

తాడికొండ: తాడికొండ గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో గురువారం నుంచి అల్ట్రాసౌండ్ స్కానింగ సేవలు, స్త్రీ వ్యాధుల నిపుణుల సేవలు పునః ప్రారంభం అయ్యాయి. గుంటూరు మెడికల్ కళాశాల అనుబంధంగా కొనసాగుతున్న ఈ గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో గత కొన్ని సంవత్సరాలుగా సేవలు పూర్తిగా నిర్వీర్యమై ప్రజలకు అందుబాటులో ఉండే పరిస్థితి లేక నానా ఇబ్బందులు పడ్డారు. ఇటీవల ఆర్‌హెచ్‌సీని పరిశీలించేందుకు వచ్చిన మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి దృష్టికి గ్రామస్తులతో పాటు పలువురు సిబ్బంది సమస్యలను తీసుకెళ్ళడంతో స్పందించిన ఆయన ఈ సేవలను ప్రారంభించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సేవలను గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ విజయలక్ష్మీ చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ సందరబగా ఆమె మాట్లాడుతూ తాడికొండలో



తాడికొండ గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో అల్ట్రాసౌండ్ సేవలు ప్రారంభిస్తున్న డాక్టర్ విజయలక్ష్మీ

స్కానింగ్‌తో పాటు స్త్రీ వ్యాధుల నిపుణుల సేవలు అందుబాటులోకి తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రిన్సిపల్ సుందరాచారి చొరవను అభినందించారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు, తొలిరోజు సేవలను 40 మంది వినియోగించుకున్నారు. దాదాపు 40 వేల మంది జనాభా ఉన్న తాడికొండ గ్రామంలో ఆర్‌హెచ్‌సీ ఉన్న కారణంగా ప్రభుత్వం నుంచి పీహెచ్‌సీ సేవలు ఇచ్చేందుకు అవకాశం లేకుండా పోయింది. అయితే ఆర్‌హెచ్‌సీ సేవలు నామమాత్రంగానే కొనసాగుతూ ప్రజలకు అందుబాటులో లేకపోవడం కారణంగా నానా ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం స్కానింగ్ సేవలు అందుబాటులోకి రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. గత వైభవం దిశగా చర్యలు తీసుకొని వైద్యులు స్థానికంగా ఉండేలా ఉంటే 24 గంటల సేవలు అందుబాటులోకి వస్తాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సీతరామ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్ర, ఆర్‌హెచ్‌టీసీ ఆరోగ్యాధికారి డాక్టర్ నళిని, పొన్నెకల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భార్గవ్ పలువురు పాల్గొన్నారు.

థలసేమియా వ్యాధిపై అవగాహన



విద్యార్థులకు అవగాహన చేస్తున్న మూర్తి శారద

మేడికొండూరు : మండలంలోని ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం థలసేమియా వ్యాధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. మూర్తి శారద ప్రక్కీ థలసేమియా వ్యాధి, లక్షణాలు, నిర్ధారణ పరీక్షల గురించి విద్యార్థులకు వివరించారు. రక్తంలో ఉండే హిమోగ్లోబిన్ శరీరంలో తగినంత ఉత్పత్తి చేయనప్పుడు ఏర్పడే రక్త వ్యాధినే థలసేమియా అంటారని తెలిపారు. హిమోగ్లోబిన్ రక్తంలోకి ఆక్సిజన్ సరఫరా చేయడం ద్వారా శరీరంలో అన్ని అవయవాలు ఆరోగ్యంగా ఉంటాయని, థలసేమియా వ్యాధి లక్షణాలు ఉన్నవారికి కావలసినంత హిమోగ్లోబిన్ ఎర్రరక్త కణాలు ఉత్పత్తి అవకపోవడం వలన వ్యక్తి బలహీనంగా, అలసటగా, ఉంటారని తెలిపారు. ఆకలి మందగించడం, శారీరక ఎదుగుదల లేకపోవడం. కామెర్లు వంటి వ్యాధులతో, తరచూ రోగాలకు గురవుతూ ఉంటారని తెలియజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు స్వప్న మాట్లాడుతూ ఈ థలసేమియా వ్యాధి సంభవించిన వారికి రక్త కణాలను మార్చడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. విద్యార్థులు రక్తదానం ద్వారా థలసేమియా వ్యాధిగ్రస్తులను కాపాడవచ్చు అని తెలియజేస్తూ, రక్తదానం అంటే ప్రాణదానం అని గుర్తు చేశారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు మాట్లాడుతూ తమ విద్యార్థులు రక్తదానంలో ముందుంటారని, గత వారంలో చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 100కుపైగా యూనిట్ల రక్తాన్ని సేకరించి శ్రీ బ్లడ్ బ్యాంక్ వారికి, థలసేమియా రోగులకు అందజేశారని తెలియజేశారు. కార్యక్రమంలో రెయిన్‌బో బ్లడ్ బ్యాంక్ నవీన్, కళాశాల ఏవో సీతారామయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి, వివిధ శాఖ అధికారులు, బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే జయంత్యుత్సవం

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంత్యుత్సవం నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు పాల్గొంటారని, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్యూబా సంఘీభావ నిధి సేకరణ



మంగళగిరి: క్యూబాకు సంఘీభావంగా గుంటూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం నగర పరిధిలోని కాజలో విరాళాలు సేకరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమెరికా సోషలిస్టు దేశమైన క్యూబాపై ఆర్థిక ఆంక్షలు విధించి దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. క్యూబా దేశానికి అండగా నిలిచేందుకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిధి సేకరించి పంపాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కాజలో ప్రజలు రూ.11,650 ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సింహాద్రి కోటిరెడ్డి, పాలేటి అప్పారావు, బి.కోటేశ్వరి, గాదె మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినిమా ఆడిషన్లను మా-ఏపీ నిర్వహించదు

'మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా



రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను, లోగో విడుదల చేస్తున్న దిలీప్‌రాజా

తెనాలి: మా-ఏపీ ఆధ్వర్యంలో ఈనెల 16న తెనాలిలో సినిమా ఆడిషన్లు నిర్వహణపై వస్తున్న వార్తలకు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్‌కు ఎలాంటి సంబంధం లేదని 'మా-ఏపీ' వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా స్పష్టంచేశారు. సంస్థ కార్యాలయంలో గురువార ం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన నటీనటుల కోసం మా-ఏపీ ఆడిషన్లు చేయదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం 2018 మా-ఏపీ రిజిస్టరైనట్లు చెప్పారు. అప్పటి ముఖ్యమంత్రి చేతులమీదుగా 'మా-ఏపీ' సంస్థ లోగోను లాంచనంగా విడుదల చేశామన్నారు. 2018లో తమకు రిజిస్టరయిన టైటిల్ (మా-ఏపీ)వేరొకరికి ఏవిధంగా వర్తిస్తుందని ఆయన సంబంధిత అధికారులను ప్రశ్నించారు. తమ సంస్థ పేరుతో తెనాలిలో వేరెవరో ఈనెల 16న ఆడిషన్లు పెడుతున్నట్టుగా జరుగుచున్న ప్రచారంపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఏప్రిల్ 16న తెనాలిలో సినిమా ఆడిషన్ల నిర్వహణకు మా-ఏపీకి ఎలాంటి సంబంధం లేదని దిలీప్‌రాజా చెప్పారు. ఇప్పుడే కాదు వేరెప్పుడూ కూడా తమ మా-ఏపీ సంస్థ ఆడిషన్లను నిర్వహించదని చెబుతూ ఔత్సాహిక నటీనటులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు. వీరితో వర్ధమాన దర్శకుడు మణివరన్, నటుడు మిలటరీ ప్రసాద్ ఉన్నారు.

ఘనంగా మహవీర్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న జైన మహిళలు

తెనాలిరూరల్: జైనులు దైవంగా ఆరాధించే మహవీర్ స్వామి జయంతి సందర్భంగా తెనాలి పట్టణ జైన సంఘీయుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక శోభాయాత్ర నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో జైన తీర్థంకర్ మహవీర్ స్వామి చిత్రపటాలను పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. తెనాలి గంగానమ్మ పేటలోని జైన్ మందిరం నుంచి ప్రారంభమైన ఊరేగింపు నెహ్రూ రోడ్, గాంధీ చౌక్, బోస్ రోడ్డు, మెయిన్ రోడ్ల మీదుగా తిరిగి ఆలయ ప్రాంగణానికి చేరుకుంది.. ఈ సందర్భంగా జరిగిన శోభాయాత్రలో సంఘ పెద్దలు, చిన్నారులు, వృద్ధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జైన్ మహవీరుని ఆధ్యాత్మిక గీతాలను ఆలపిస్తూ, గీతాలాపనలు, నత్య ప్రదర్శనలు చేశారు. జైన మత ఉద్దేశాన్ని తెలియజేశారు. జైన మతం కేవలం భారతదేశంలోనే కాదని పాశ్చాత్య దేశాల్లోనూ విస్తరించినట్లు సంఘీయులు తెలియజేశారు.

మైనార్టీలు, అణగారిన వర్గాలకు అండగా నిలవడమే జనసేవ దళ్ లక్ష్యం

శిక్షణ తరగతులను ప్రారంభించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మంగళగిరి: మైనార్టీలకు, అణగారిన వర్గాలు, గిరిజనులకు అండగా నిలవడమే జనసేవ దళ్ లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. గురువారం గుంటూరు జిల్లా మంగళగిరి నగరంలోని చినకాకానిలో జనసేవ దళ్ సభ్యులకు శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జనసేవ దళ్ ప్రతినిధులు తుపాను, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలకు అండగా నిలిచి ఆదుకోవడం, సేవా కార్యక్రమాలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు, చిన్ని తిరుపతయ్య, గుంటక సాంబిరెడ్డి,దోనేపూరి శంకర్, కోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ

తాడికొండ: తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లను గురువారం గుంటూరు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ తేజ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. సభా ప్రాంగణాన్ని పరిశీలించి ఏర్పాట్లపై ఆర్ అండ్ బీ అధికారులకు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు వెళ్ళి పరిశీలించి అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సలహాలిచ్చారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో పలువురు అధికారులతో సమావేశం నిర్వహించిన ఆయన పారిశుద్ధ్యం ఏర్పాట్లు అన్నీ శుక్రవారం లోగా పూర్తి చేయాలన్నారు. వాహనాల పార్కింగ్, బారికేడ్ల ఏర్పాటు సజావుగా ఉండాలని, పాల్గొనే అతిథులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటంతో పాటు స్నాక్స్, తాగునీరు వంటివి సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమం ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు విద్యుత్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ శాఖాధికారులు ముందస్తు చర్యలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తుళ్ళూరు డీఎస్పీ మురళీ కృష్ణ, సీపీవో శేషశ్రీ, డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా పీడీలు విజయలక్ష్మీ, శంకర్, డీపీవో నాగసాయి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాభాయి, పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ, తాడికొండ, గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్‌లు, మెహర్ బాబు, వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కె.సమతావాణి, సీఐ కె.వాసు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్ హామీని నిలబెట్టుకోవాలి



దీక్ష శిబిరాన్ని సందర్శించి మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు దుర్గారావు

తాడేపల్లి రూరల్: ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు నిచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు అన్నారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏపీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకుని కార్మికుల మన్ననలు పొందాలని కోరుతున్నామని పేర్కొన్నారు. కోర్టులు కార్మికులకు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా ఇప్పటి వరకు అమలు జరగలేదని వివరించారు. కార్యక్రమంలో ఎస్.సుబ్బారావు, హగ్గయ్య, గురవయ్య, ఇమాంబి, సారమ్మ, యెహోషువా, ఇస్మాయిల్, నాగేశ్వరరావు, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



గౌతమబుద్ధ రోడ్‌లో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం నాయకులు

మంగళగిరి టౌన్: దేశవ్యాప్తంగా ఉన్న ముస్లిం, మైనార్టీలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని మంగళగిరి పట్టణానికి చెందిన అంజుమాన్ – ఈ – హిమాయతుల్ ఇస్లామ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణ పరిధిలోని గౌతమబుద్ధ రోడ్‌లోని జామియా మసీద్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతియుత నిరసన ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న ముస్లిం మైనార్టీలపై కక్ష సాధింపు కోసమే కొత్త చట్టాలు తీసుకువస్తోందన్నారు. దేవుడికి అంకితం చేస్తూ ముస్లిం దాతలు ఇచ్చిన భూములు వక్ఫ్‌బోర్డు పరిధిలో అనాదిగా ఉన్నాయన్నారు. ఈ ఆస్తులపై కేంద్రంలో ఉన్న బీజేపీ బడా బాబులకు ధారాదత్తం చేయడానికి చట్టంలో మార్పులు తీసుకువచ్చిందని విమర్శించారు. పేదలకు చెందాల్సిన భూములను లాక్కోవడం ద్వారా ముస్లింలను ఆర్థికంగా బలహీనులను చేసి రాజకీయంగా, సామాజికంగా ఎదగకుండా చేయాలన్నదే బీజేపీ లక్ష్యమని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ముస్లిం మైనార్టీల ఆస్తులకు రక్షణగా ప్రత్యేక వక్ఫ్ చట్టాన్ని రాజ్యాంగం అమలు చేసిందని, మోదీ ప్రభుత్వం ముస్లింలను అణగదొక్కేందుకే ఈ చట్టానికి సవరణలు చేయాలని చూస్తోందని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రంలోని సీఎం చంద్రబాబు నాయుడికి, కేంద్రంలో ఉన్న మోదీకి తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు సరళమైన రుణవిధానం బీఆర్‌ఈ

జీఎస్టీ ప్రాక్టీషనర్స్ సమావేశంలో స్టేట్‌బ్యాంక్ రీజినల్ మేనేజర్ వీవీ జగదీష్‌కుమార్



మాట్లాడుతున్న వీవీ జగదీష్‌కుమార్

తెనాలి: భారతీయ స్టేట్ బ్యాంక్ ఖాతాదారులకు బ్యాంకు రుణాలు సులభంగా అందించటానికి సరళమైన విధానాన్ని రూపొందించినదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ రీజినల్ మేనేజర్ వీవీ జగదీష్‌కుమార్ సూచించారు. స్టేట్ బ్యాంక్ రీజినల్ ఆఫీస్ ఆధ్వర్యంలో స్థానిక సుల్తానాబాద్‌లోని స్వర్ణ ఇన్ హోటల్‌లో గురువారం జీఎస్టీ ప్రాక్టీషనర్స్ (ఆడిటర్స్)తో సమావేశం జరిగింది. సభకు ఆడిటర్ అమరా గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. బ్యాంక్ నూతనంగా ప్రారంభించిన బీఆర్‌ఈ (బిజినెస్ రూల్ ఇంజిన్) రుణాల విధివిధానాలను వీవీ జగదీష్‌కుమార్ వివరంచారు. రుణాలు కావలసిన ఖాతాదారులు ఎస్‌బీఐ పోర్టల్‌లో స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకొని సత్వరమే రుణం పొందటానికి అవకాశం ఉందన్నారు. ఎస్‌ఎంఈ శాఖ చీఫ్ మేనేజర్ భరద్వాజ్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రూ.10 లక్షల నుండి రూ.5 కోట్ల వరకు రుణం పొందవచ్చని తెలిపారు. ఆడిటర్లు అమరా గోపాలకృష్ణ, సూర్యనారాయణ, రవి శంకర్, నరేంద్రలు మాట్లాడుతూ, జీఎస్టీ సబ్మిట్ చేసే ప్రతి వ్యాపారి ఈ నూతన విధానాన్ని తెలుసుకుని తేలికగా రుణాలను పొందవచ్చని సూచించారు. చీఫ్ మేనేజర్ అజగర్‌అలీ, బ్యాంక్ అధికారి కర్ల శ్రీనివాసరావు, ప్రాంతీయ కార్యాలయ అధికారులు ప్రవీణ్, శ్రీనివాసరావు, మారీస్‌పేట శాఖాధికారి మల్లిఖార్జునరావు, వివిధ శాఖాధికార్ల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

14న తెనాలిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి

తెనాలిఅర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 14న రాజ్యాంగ నిర్మాత డాక్టర బీఆర్ అంబేడ్కర్ జయంతిని తెనాలిలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్ కుమార్ పేర్కొన్నారు. రైల్వేస్టేషన రోడ్డులోని ఐక్యవేదిక కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో సేవలందించిన వారికి విశిష్ట సేవా పురస్కారం ఇవ్వనున్నట్లు తెలిపారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ముఖ్యఅతిథులుగా సబ్ కలెక్టర్ సంజనా సింహా, ఏఎస్‌ఎన్ విద్యాసంస్థల చైర్మన్ అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, ఎంఈవో-2 జయంతిబాబు, రైల్వే సూపరింటిండెంట్ రమణ, తదితరులు పాల్గొంటారని చెప్పారు. సీనియర్ పాత్రికేయులు బీఎల్.నారాయణ, ఏఎస్‌ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, ప్రముఖ శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు, జైభీమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె. దేవయ్య, ప్రముఖ వ్యాపారి మునగాల శ్యామ్‌ప్రసాద్, గల్లా జ్ఞానశేఖర్, కనపర్తి రత్నాకర్, షేక్ ఫరీద్, ఎండీ సుబ్బయ్య, బండికళ్ళ సతీష, ఆరాధ్యుల కన్నా తదితరులు పురస్కారాలు ప్రధానం చేయనున్నట్లు చెప్పారు.